# ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలి

దమ్మపేట, అక్టోబర్ 13: ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో అందరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని తహసీల్దార్ ముజాహిద్ అన్నారు. శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలై 72 గంటలు ముగిసిన నేపథ్యంలో అన్ని పబ్లిక్, ప్రైవేట్, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లను తొలగించామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాలు నిర్వహించేందుకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. మండలంలో 20,644 మంది పురుషులు, 22,250 మహిళలు, ఇతరులు ఒకరు మొత్తం 42,895 మంది ఓటర్లు ఉన్నారని, 52 పోలింగ్ కేంద్రాల్లో వీరు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. మరో పదిరోజుల్లో పూర్తిస్థాయిలో పోలింగ్ కేంద్రాల వద్ద సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. 100శాతం ఓటుహక్కు నమోదయ్యేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

**ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు: ఎస్సై షాహినా**

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 13: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎస్సై షాహీనా అన్నారు. గురువారం మండలంలోని బూర్గుగూడెం శివారులో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం, డబ్బు అక్రమ రవాణాపై నిఘాను పటిష్టం చేశామని, రూ. 50 వేలకు మించి నగదును తరలించవద్దన్నారు. నగదు తీసుకెళ్లాల్సి వస్తే అందుకు అవసరమైన రశీదులను చూపాలన్నారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





తహసీల్దార్ సుల్తానా ఎదుట బైండోవర్ చేస్తున్న ఎస్సై, అన్నపురెడ్డిపల్లి: వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

**తహసీల్దార్ ఎదుట 20మంది బైండోవర్**

చండ్రుగొండ, అక్టోబర్13: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ సాజియా సుల్తానా అన్నారు. శుక్రవారం ఇటీవల వివిధ కేసుల్లో ఉన్న 20 మందిని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆమె వారికి అవగాహన కల్పించారు. త్వరలో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా, ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

**సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెడితే కేసులు..ఎస్సై మాచినేని రవి**

మండలంలో యాక్టివ్‌గా ఉన్న సోషల్ మీడియా వాట్సప్ గ్రూపుల్లో ఎవరైనా ఇష్టానుసారంగా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై మాచినేని రవి హెచ్చరించారు. శుక్రవారం ఆయన పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. సోషల్ మీడియా పక్క వారి గురించి, ఇతర పార్టీల గురించి కించ పరిచేలా వ్యాఖ్యలు, పోస్టులు పెడితే ఆ గ్రూపు అడ్మిన్‌దే బాధ్యతన్నారు. అడ్మిన్‌గా ఉన్నవారు తమ గ్రూపు సభ్యులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడలకు విద్యార్థుల ఎంపిక



పీ కీర్తన వీ పూజ కే జ్యోత్స్న

దమ్మపేట, అక్టోబర్ 13: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అండర్-17 బాల, బాలికల వాలీబాల్ పోటీలు జరుగుతున్నాయి. అండర్-17 బాలికల వాలీబాల్ విభాగంలో మండలంలోని పెద్దగొల్లగూడెం ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు పీ కీర్తన, వీ పూజ, కే జ్యోత్స్న ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన వారిని ఐటీడీఏ ఏటీడీవో చంద్రమోహన్, హెచ్‌ఎం విజయలక్ష్మి, పీడీ వెంకటేశ్వర్లు, పీఈటీ నాగమణిలు, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## ప్రజలు భాగస్వాములు కావాలి



మట్టిని అందుకుంటున్న హేమంత్‌కుమార్

అశ్వారావుపేట, అక్టోబర్ 13: 'మేరి మిట్టి-మేరా దేశ్' కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు, రైతులు భాగస్వాములు కావాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరులను స్మరించుకునేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. దేశ వ్యాప్తంగా అమృత కలశ యాత్ర ద్వారా సేకరించిన మట్టితో ఢిల్లీలో జాతీయ యుద్ధస్మారకం వద్ద అమరుల గౌరవార్థం స్తూపం నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సేకరించిన మట్టిని డీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జీ గోపాలకృష్ణమూర్తి, శిరీష, కృష్ణతేజ, పావని, విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యం వ్యాన్‌తో పోలీసులు

అశ్వారావుపేట, అక్టోబర్ 13: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పిఠాపురానికి చెందిన ఆకుల రవి, అమ్మిరాధి శివచక్ర రాంబాబు, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన మొగిలిచర్ల సతీశ్‌లు గంగారం సమీప గ్రామాల్లో రేషన్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి పిఠాపురం తరలిస్తున్నారు. స్థానిక పాపిడిగూడెం గ్రామ సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎస్సై వాహనంలో తరలిస్తున్న రేషన్ బియ్యం గుర్తించారు. వాహనంతో పాటు రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

## పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కే ప్రవీణ్ కుమార్**




మాట్లాడుతున్న ఐపీవో ప్రవీణ్ కుమార్

దమ్మపేట రూరల్, అక్టోబర్ 13: సామాన్యులకు అందుబాటులో వున్న ఉపయోగకరమైన పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పాల్వంచ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కే ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని మందలపల్లి షిర్డి సాయిబాబా మందిర ఆవరణలో నిర్వహించిన పోస్టల్ పథకాలు, సేవల గురించి అవగాహన కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. సంవత్సరానికి కేవలం రూ.399ల సంవత్సర ప్రీమియంతో రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీ పొందవచ్చన్నారు. ఇండియా పోస్టల్ పేమెంట్ బ్యాంకు ద్వారా ఉచిత ఖాతా ప్రారంభిస్తామని, కమిషన్ లేకుండా బ్యాంకు ఖాతాలోని డబ్బులు చెల్లింపుల సేవలు అందుబాటులో వున్నాయన్నారు. రికరింగ్ డిపాజిట్, సేవింగ్స్ బ్యాంక్, సుకన్య సమృద్ధి పథకం, మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికేట్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ వంటి ఆకర్షణీయ పథకాలు అందుబాటులో వున్నాయని ప్రవీణ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో పోస్టల్ ఎంవో విష్ణు, దమ్మపేట ఎస్‌వో దేవకుమారి, మందలపల్లి బీపీ మత్తె వెంకటేశ్వరరావు, బ్రాంచ్ పోస్టు మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అబ్బు గూడెంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 13: మండలంలోని అబ్బుగూడెంలో ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక జ్వరపీడితులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.... వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమలతో అనేక రోగాలు వ్యాప్తి చెందుతాయని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**దిబ్బ గూడెంలో..**



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాందాసు

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 13: వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలోని దిబ్బగూడెంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ రాందాసు 46మంది రోగులను పరీక్షించారు. తొమ్మిది మంది జ్వర పీడుతులను గుర్తించి రక్త పరీక్షలు చేయగా మలేరియా లేదని నిర్ధారించారు. ఇద్దరు గర్భవతులను పరీక్షలు చేసి వినాయకపురం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి చికిత్సలు, అన్ని రకాల రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సబ్ యూనిట్ అధికారి ఆజ్మీరా వెంకటేశ్వరరావు, హెచ్‌ఈవో రాజు, పర్యవేక్షణాధికారి శ్రీనివాస్, హెచ్‌ఏ సత్యనారాయణ, ఏఎన్‌ఎం చెల్లమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చీడ పీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 13: రైతులు పంటల్లో చీడ పీడల నివారణకు తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. శుక్రవారం మండలంలోని అన్నపురెడ్డిపల్లి, మర్రిగూడెం గ్రామాల్లో కృషి విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో అధికారులు పత్తి, వరి, మిరప పంటలను పరిశీలించారు. వరి పంటలో కంకినల్లి, పాము పొడ, అగ్గితెగులు, పత్తిలో తెల్లదోమ, రసం పీల్చే పురుగులు, పేను బంక సోకినట్లు గమనించామన్నారు. పంటల్లో తెగులు నివారణకు మందులను పిచికారీ చేయాలన్నారు. మిరప రైతులు పసుపు రంగు, నీలం రంగు జిగురు అట్టలు పొలంలో ఎకరానికి 50 నుంచి 100 వరకు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్ కుమార్, శివ, ఏడీఏ లాల్ చంద్, ఏవో అనూష, ఏఈవో ప్రశాంత్ పాల్గొన్నారు.

## పారిశుధ్యం ప్రత్యేక దృష్టి



పిచ్చిమొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 13: పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ఈవో గజవెల్లి హరికృష్ణ తెలిపారు. శుక్రవారం వార్డుల్లో అంతర్గత రహదారులకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. గృహ యజమానులు చెత్తను రహదారులపై వేయొద్దని, ఇంటి ఎదురుగా వచ్చే చెత్త సేకరణ వాహనాల్లో వేయాలన్నారు.

## పోలేరమ్మ ఆలయంలో పూజలు

అశ్వారావుపేట రూరల్, అక్టోబర్ 13: మండలంలోని నారంవారిగూడెం కాలనీలోని పోలేరమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి అమావాస్యకు ఈ ఆలయంలో భక్తుల సందర్శనకు ద్వారాలు తెరుస్తారు. అమావాస్య రోజున పూజలు చేస్తే ఇంటిల్లపాది సుఖసంతోషాలతో గడుపుతారని భక్తుల నమ్మకం. ఆలయ గురుస్వామి గేదల విష్ణుమూర్తి ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారు.

## వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అన్నదానం

అశ్వారావుపేట టౌన్, అక్టోబర్ 13: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు అలంకరణలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

## రాజకీయ పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు



ములకలపల్లి, అక్టోబర్ 13: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని తిమ్మంపేట గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్మికులు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసి, పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించారు. పంచాయతీ బిల్ కలెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.